క్లుప్తంగా

యువత సేవాగుణాన్ని అలవర్చుకోవాలి



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై. కిరణ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని దీనాపూర్ క్యాంపస్ అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.రంజన్ బాబు ఆరో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని చెప్పారు. ఫార్మసీ కళాశాల విద్యార్థులు 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కార్డ్స్ సంస్థ డైరెక్టర్ ఎం.మేరి, కళాశాల ప్రిన్సిపాల్ డి. జీవన్ మణిబాబు, రూరల్ క్రిస్టియన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దీనసుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఫిరంగిపురం: ఎన్నికల విధులను పారదర్శకంగా సిబ్బంది నిర్వహించాలని తహసీల్దార్ రాజారమేష్ అన్నారు. మండలకేంద్రంలోని సీడీపీవో కార్యాలయంలో సోమవారం ఎన్నికల విధులు, ఓట్లు మార్పులు, చేర్పులపై బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల లిస్టుకు సంబంధించి మార్పులు, సవరణలు, తొలగింపులు మంగళవారంతో ముగియనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరితగతిన బూత్ లెవల్ స్థాయిలో పెండింగులో ఉన్న అర్జీలను గుర్తించి సవరణలు చేయాలని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయిలో నివేదికను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి అధికారుల పర్యటన



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ప్రాతూరు, కుంచనపల్లి ప్రాంతాల్లో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదేశాల మేరకు ప్రాతూరు గ్రామంలో నిర్మించవలసిన రోడ్లను పరిశీలిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రాతూరులో రేపల్లె కనకదుర్గ వారధి కట్ట నుంచి ప్రాతూరు శివాలయం మీదుగా గుండిమెడకు వచ్చే రహదారి పూర్తిగా లోతట్టు ప్రాంతం కావడంతో వర్షాలు పడే సమయంలో రోడ్డుపై నీరు నిలబడి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ రహదారి నిర్మాణానికి కార్పొరేషన్ నిధుల నుండి రూ.46 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ కిషోర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రూరల్ అధ్యక్షుడు సంకురు మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు వీల్‌చైర్లు అందజేత



తాడేపల్లిరూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరు క్రాస్ రోడ్ వద్ద గల ఫార్చ్యూన్ గ్రాండ్ హోటల్ నందు వికలాంగులకు వీల్ చైర్స్ అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు పరుచూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ గవర్నర్ అఫీషియల్ విజిట్ కార్యక్రమానికి రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ బుసిరెడ్డి శంకరరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారని తెలిపారు. సమాజానికి సేవ చేయాలనుకునే వారు రోటరీ ద్వారా చేయవచ్చని అన్నారు.
రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. 15 మంది వికలాంగులకు వీల్ చైర్స్ అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి వుండేల చంద్ర ఓబులారెడ్డి, కోశాధికారి గోపు నాగరాజు, ఎలక్ట్ ప్రెసిడెంట్ రావూరి రమేష్‌బాబు, మాజీ ప్రెసిడెంట్ మున్నంగి వివేకానందరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శెట్టి కేశవరావు, కాట్రగడ్డ శివన్నారాయణ, కొత్తలంక అమరేంద్ర, పలగాని శ్రీనివాస్, పలగాని శ్రీకాంత్, దోనేపూడి క్రాంతి కుమార్, ఎస్‌వి నాగకిరణ్, తెనాలి, మంగళగిరి, గుంటూరు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



వలంటీర్లకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

మేడికొండూరు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా నిలిచిన వలంటీర్ల సేవలు అభినందనీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం పురస్కారాలు అందజేయడం జరుగుతోందన్నారు. సేవలకు అనుగుణంగా వలంటీర్లకు సేవారత్న, సేవావజ్ర, సేవామిత్ర పురస్కారాలు అందజేయడం జరిగిందన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో ముందుంటారన్నారు. నవరత్నాల పథకాలు అందజేయడం వల్లే ప్రజలంతా తిరిగి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరుకుంటున్నారన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల వలంటీర్లకు ఎమ్మెల్యే సుచరిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీటీసీ సభ్యుడు మన్నవ స్వప్నరాజేష్, తహసీల్దారు రాజ్యలక్ష్మి, ఎంపీడీవో ప్రభాకరరావు, ఏపీఎం విజయభారతి, కరీముల్లా, మల్లేశ్వరరావు, కరుణ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల దుకాణం ప్రారంభం

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత సోమవారం ప్రైమరీ సొసైటీ ప్రాంగణంలో జనరిక్ మెడికల్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసమైన మందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ దుకాణాల్లో తక్కువ ధరకు లభ్యమవుతాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంభా త్రివేణి, మండల జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, ఎంపీటీ మన్నవ స్వప్న రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శౌరిరెడ్డి, కంకణాల పరమేశ్వరరావు, రవి, జోసఫ్‌రెడ్డి, నరేష్, జేసీఎస్ కన్వీనర్, సచివాలయ సిబ్బంది, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి మేకతోటి సుచరిత పర్యటించారు. సోమవారం సాయంత్రం గ్రామానికి విచ్చేసిన ఆమె సీనియర్ నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి ఇంట్లో నాయకులు, కార్యకర్తలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం తాడికొండ జయభారత్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక లను పరిచయం చేసుకున్నారు. స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని పాస్టర్ల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం సంఘ పెద్దలు ఎమ్మెల్యే సుచరితను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ 40 రోజుల పాటు నిర్వహించే పవిత్ర తపస్సు కాలంలో ఉపవాస దీక్షలు ఆచరించడం అందరికీ శుభకరమన్నారు. అనంతరం రజక కాలనీలో పక్షవాతంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఏసయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సర్పంచ్ తోకల సరోజిని, జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ నాయకులు తుమ్మల తిరుపతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి
- గుడ్‌మార్నింగ్ మంగళగిరిలో ప్రజా సమస్యల పరిష్కారం



బట్టలు ఇస్త్రీ చేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతుందని ఇదే విధంగా అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కాలనీలో సోమవారం గుడ్ మార్నింగ్ మంగళగిరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజలకు ఏ పథకం అందాలన్నా ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పథకాలు చేరుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వాల పాలనకు, ఇప్పటి పాలనకు బేరీజు వేసుకున్న ప్రజలు మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని ముక్త కంఠంతో చెబుతుండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, జిల్లా మహిళా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, వెంకటేశ్వర్లు, రంగిశెట్టి పెద్దబ్బాయి, బేతపూడి నరసయ్య, వల్లంశెట్టి విజయ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేతలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ప్రసాద్

మంగళగిరి: చేనేతలు ఎక్కువగా వున్న నియోజకవర్గాలలో వారికే అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కెటాయించాలని వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ప్రసాద్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ విభాగాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ చేనేతలు అధికంగా వున్న నియోజకవర్గాలలో ఇతర సామాజిక వర్గాలకు సీట్లు కెటాయించడంతో చేనేతలకు రాజకీయ ప్రాధాన్యత తగ్గి అన్యాయం జరుగుతుందన్నారు. చేనేతలపై చంద్రబాబుకు ప్రేమ ఉంటే అత్యధిక చేనేతలు ఉన్న మంగళగిరి నుంచి లోకేష్ తప్పుకుని చేనేతలకు సీటు కెటాయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా చేనేతలున్న చీరాల, మంగళగిరి, వెంకటగిరి, మదనపల్లి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ధర్మవరం, పుట్టపర్తి, పెనుగొండ, ఎమ్మిగనూరు, రాజమండ్రి రూరల్, గాజువాక, విశాఖపట్నం సౌత్ నియోజకవర్గాలను చేనేతలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు యనమాల శివరాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రాజారావు, ప్రతినిధులు పిల్లలమర్రి బాలకృష్ణ , రామనాథం, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ ఈదులమూడికి సత్కారం



ఈదులమూడి దేవిడ్‌రాజును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కో ఆర్డినేటర్‌గా ఈదులమూడి డేవిడ్‌రాజును నియమించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ పదవి దక్కడంతో ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ తాడేపల్లి నివాసి అయిన ఈదులమూడి డేవిడ్ రాజుకు వైఎస్సార్‌సీపీలో జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్‌గా ఎన్నుకోవడం ఆనందించదగ్గ విషయమని అన్నారు. ఈదులమూడి డేవిడ్ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు తనపై నమ్మకం ఉంచి పదవిని ఇచ్చారని, గుంటూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేసి విజయానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, గుంటూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మేకా వెంకటరామిరెడ్డి, అధ్యక్షులు ఆకురాతి రాజేష్, గుంటూరు జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, తాడేపల్లి పట్టణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, సంపూర్ణ పార్వతి, కుంచాల శ్రీను, సింహాద్రి, గోపి, కొరగంటి ఉదయరాజు, ప్రశాంత్, సోషల్ మీడియా కన్వీనర్లు రవిసాగర్, మల్లవరపు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సు మంగళవారం నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్, అంబేడ్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్ తెలిపారు. 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానం ఆర్థిక అభివృద్ధి దేశ నిర్మాణం' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ హాజరవుతారని, సఫాయి కర్మచారి ఆందోళన్ కన్వీనర్ బెజవాడ విల్సన్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి హాజరవుతారని తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు ప్రాధాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) రాష్ట్ర కార్యవర్గంలో గుంటూరు జిల్లాకు ప్రాధాన్యం లభించినట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశంలో భాగంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వి. ప్రసాదరావు, కె.జోజప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం, ఓంకార క్షేత్రం కార్యదర్శి నంబూరు వెంకట శ్రీమన్నారాయణమూర్తి ఆధ్వర్యంలో 90వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం నగరసంకీర్తన, నిత్యపూజలు విశేషంగా నిర్వహించారు. పద్మావతీ, ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం రుత్వికుల వేదమంత్రాల నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు. పద్మనాభ శర్మ చేసిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది.

చంద్రబాబు పాలనలో చేనేత పరిశ్రమ నిర్వీర్యం

- చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణిల విమర్శలు అర్థరహితం
- నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి



సమావేశంలో మాట్లాడుతున్న గంజి చిరంజీవి

మంగళగిరి: అధికారంలో ఉన్న 14 ఏళ్లలో చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుదేనని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి విమర్శించారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణిలు వాస్తవాలు తెలుసుకోకుండా ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం చిరంజీవి మీడియాతో మాట్లాడుతూ మూడు శాఖల మంత్రిగా అధికారంలో ఉన్న లోకేష్ మంగళగిరి అభివృద్ధి కోసం ఏనాడూ పట్టించుకోకపోవడం కారణంగానే మంగళగిరి ప్రజలు చిత్తుగా ఓడించారన్న వాస్తవాన్ని గుర్తించుకోవాలన్నారు. ఎన్నికలు దగ్గరకు రాగానే సేవా కార్యక్రమాల పేరుతో లోకేష్ ఆడుతున్న డ్రామాలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంటే ఏనాడూ ప్రేమ లేదని వారిని కేవలం ఓటు బ్యాంకు గానే పరిగణించారన్నారు. ఈ వాస్తవాన్ని గ్రహించిన వీరంతా చంద్రబాబుతో పాటు లోకేష్‌ను ఓడించారన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కేవలం ఎన్నికల సమయంలో కోట్లు కుమ్మరించి ఓట్లు కొనుగోలు చేసి గెలవాలంటే ప్రజలు అంత అమాయకులు కాదని గుర్తించాలన్నారు. ఎదుటివారిని విమర్శలు చేసేముందు తమకు తాము ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

మహిళల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం



మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న మేకతోటి సుచరిత

మేడికొండూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నారని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. మండల కేంద్రమైన మేడికొండూరులో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రూ 4.62 కోట్ల నమూనా చెక్కును డ్వాక్రా మహిళలకు సుచరిత అందజేశారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దారు రాజ్యలక్ష్మి, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం విజయభారతి, జంగుంట్ల పాలెం సర్పంచ్ కల్లి శ్రీదేవి సాంబిరెడ్డి, పలు గ్రామాల నాయకులు, డ్వాక్రా యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచనలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీసత్యసాయి విద్యాసంస్థలు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గుంటూరు చలమయ్య– కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవత్వాన్ని పెంపొందించు విద్య ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని వి.పూజిత రాష్ట్ర స్థాయి, బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థిని షేక్ సుహానా జిల్లా స్థాయితో పాటు ఇంటర్ విభాగంలో ప్రథమ సంవత్సర విద్యార్థిని కె.శిరీషా చిన్మయి రాష్ట్రస్థాయిలో బహుమతులు గెలుపొందారని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణప్రభు మాట్లాడుతూ విద్యార్థులతు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే జీవితంలో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్, ప్లేస్‌మెంట్ అధికారులు ఏ శ్రీధర్, చంద్రశేఖర్, కల్చరల్ కో–ఆర్డినేటర్ మధుసూదన్ పాల్గొన్నారు.

కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ ప్రారంభం



ప్రసంగిస్తున్న అర్జునరావు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో సోమవారం కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీ 2024 ను మాజీ భారత కబడ్డీ క్రీడాకారుడు, విజయవాడ రైల్వే ఉద్యోగుల సంక్షేమ అధికారి నక్కల అర్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్జునరావు మాట్లాడుతూ శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె. హరికిషోర్ మాట్లాడుతూ కోనేరు లక్ష్మయ్య స్మారక ట్రోఫీని 2012 సంవత్సరం నుంచి ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్న ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ రాష్ట్రాల నుంచి సుమారు 480 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సీహెచ్ హనుమంతరావు, సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమసుందరేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



అలంకరణలో సోమసుందరేశ్వరస్వామి

గుంటూరు ఈస్ట్: అరండల్‌పేటలోని శ్రీగంగా మీనాక్షి సోమసుందర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు రెండో రోజుకు చేరాయి. గోపూజ, దేవాలయ ప్రదక్షిణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమశాలలో గణపతి హోమం, వేదోక్తంగా చేశారు. ఉపాలయాల్లో మూర్తులకు అభిషేకాలు కనులపండువగా నిర్వహించారు. మండప పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి భాస్కరశర్మ మాట్లాడుతూ 20వ తేదీ నవ చండీపారాయణ, చండీహోమం, సామూహిక లలిత సహస్ర నామ పారాయణం జరుగుతాయని పేర్కొన్నారు. 21న మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, బిల్వార్చన చేస్తారన్నారు. మండ పూజలు నిర్వహిస్తారని చెప్పారు. 22న రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం శాంతి కల్యాణం వైభవంగా జరుగుతోందన్నారు. 23న స్వామివారు, అమ్మవార్లకు నందివాహన సేవ, అన్న ప్రసాద వితరణ జరుగతాయని చెప్పారు. భక్తులకు పాల్గొని స్వామివారు, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధనే లక్ష్యం

మంగళగిరి: అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధనే లక్ష్యంగా యూనివర్శిటీలో లిబరల్ ఆర్ట్స్ స్కూలు ప్రారంభించడం జరిగిందని ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రెసిడెంట్ పి సత్యనారాయణన్ తెలిపారు. మండలంలోని నీరుకొండ గ్రామంలో గల యూనివర్శిటీలో సోమవారం ఈశ్వరీ లిబరల్ ఆర్ట్స్ స్కూలు ప్రారంభించి మాట్లాడారు. స్కూలును దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.బీఎస్సీ, బీఏ చదివే విద్యార్థుల కోసం వివిధ రకాల కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, హిస్టరీ వంటి సబ్జెక్టులలో పీహెచ్‌ఏ ప్రోగ్రామ్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో యూనివర్శిటీ వీసీ మనోజ్ అరోరా, పాలక మండలి సభ్యులు నికోలస్, జానకి బాక్లే, ప్రశాంత్ మహపాత్రో, గోపాల్ గురు, చందన్ గౌడ్, ప్రదీప్ ఖోస్లా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై చర్చ

లక్ష్మీపురం: స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గుంటూరులో తాగునీటి సరఫరాపై సోమవారం చర్చ నిర్వహించారు. సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని చెప్పారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్.వి సింగరయ్య మాట్లాడారు. అదే విధంగా పార్లమెంట్ సంప్రదాయాలపై నిర్వహించిన చర్చలో విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల వీఎస్ ప్రసాదరావు, విద్యావేత్తలు ఆర్.రామచంద్రరావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు ప్రొఫైలింగ్ క్యాంప్

నెహ్రూ నగర్: మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు ఈ నెల 21వ తేదీన ప్రొఫైలింగ్ క్యాంప్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం తెలిపారు. గుంటూరు పరిధిలో ఉన్న మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులను గుర్తించి కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా, సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న నేషనల్ ఏక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ పథకంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రొఫైలింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వివరించారు.

నేడు లైసెన్స్ హక్కుల వేలం

పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 2024 –2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ లైసెన్స్ హక్కులకు రెండవ విడత మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. శివాలయంలో ఉదయం 11 గంటల నుంచి ఈ– టెండరు, సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: మద్యం బాటిళ్లు తరలిస్తున్న ప్రభుత్వ వైన్‌షాపు సూపర్‌వైజర్‌పై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చల్లావారిపాలెంకు చెందిన లక్కిరెడ్డి శివరామకృష్ణ నగరంలోని కంకరగుంట సమీపంలోని ప్రభుత్వ వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. షాపులోని మద్యం బాటిళ్లను అక్రమంగా ఇంటికి తరలించి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం రామకృష్ణారెడ్డి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 133 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.